సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 26 । జూలై । 2023



శిశువుల్లో లోపాలను గుర్తించాలి
బిడ్డ జన్మించిన నాటి నుంచి మూడేళ్ల లోపల ఆరోగ్య లోపాలను గుర్తించాలని యునిసెఫ్ ప్రతినిధులు సూచించారు. - 8లో



మద్దువలసలో ఏనుగుల గుంపు
వంగర మండల పరిధి మద్దువలస పంటపొలాల్లో ఏనుగుల గుంపు తిష్ఠవేసింది. - 8లో



ముమ్మరంగా వరి ఉభాలు
రేగిడి: వర్షాల జోరుతూ వరి ఉభాలు ప్రారంభమయ్యాయి. అంబఖండి, వన్నలి, సోమరాజుపేట, లక్ష్మీపురం, ఉప్పర్నాయుడు వలస గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి.

న్యూస్‌రీల్

పల్లెచెంతనే ప్రభుత్వ సేవలు

- పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్



జర్నలో దరఖాస్తుదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

గుమ్మలక్ష్మీపురం: జగనన్న సురక్ష కార్యక్రమంతో లబ్ధిదారులకు గ్రామంలోనే 11 రకాల ప్రభుత్వ సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నట్టు పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో జర్న గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దరఖాస్తుదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, జర్న సర్పంచ్ కొండగొర్రి ఉష, మాజీ ఎంపీటీసీ కొండగొర్రి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతే ప్రధానం

- ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే



భామిని ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కాంతిలాల్ దండే, కల్పనాకుమారి

భామిని: గిరిజన విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యాబోధనకు అనుగుణంగా ఏకలవ్య మోడల్ స్కూల్ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే మంగళవారం ఆదేశించారు. భామిని మండల కేంద్రంలో సుమారు రూ.12 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఏకలవ్య స్కూల్ భవనాలను సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారితో కలిసి పరిశీలించారు. సెప్టెంబర్ 15 నాటికి నిర్మాణాలు పూర్తిచేయాలని ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ శ్రీనివాసరావుకు సూచించారు. ఆయన వెంట ఈఈ సింహాచలం, ఏఈ సత్యనారాయణ, డీడీ శ్రీనివాసరావు ఉన్నారు.


సరుకుల నిల్వలపై ఆరా



గుమ్మలక్ష్మీపురం డీఆర్ గొడౌన్‌లో నిల్వలను పరిశీలిస్తున్న జీసీసీ స్టేట్ డైరెక్టర్ చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ బ్రాంచ్ కార్యాలయాన్ని జీసీసీ స్టేట్ డైరెక్టర్ చిన్నారావు మంగళవారం సందర్శించారు. కార్యాలయం ఆవరణలోని డీఆర్ డిపో, డీఆర్ గోదాం, గ్యాస్ గొడౌన్, ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. సరుకుల నిల్వలపై ఆరా తీశారు. బ్రాంచ్ పరిధిలోని సమస్యలను మేనేజర్ కృష్ణప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అకౌంటెంట్ గణపతి, సూపరిండెంటెంట్ ఎం.సాంబశివరావు ఉన్నారు.

కాస్త పెరిగిన తోటపల్లి నీటిప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టు వద్ద పరిస్థితి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఒడిశా తీరంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటిప్రవాహం కాస్త పెరిగింది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద మంగళవారం సాయంత్రానికి 105 మీటర్లకు 104.46 మీటర్ల మేర నీరునిల్వ ఉంది. ప్రస్తుతం నది పైభాగం నుంచి ప్రాజెక్టుకు 4,584 క్యూసెక్కుల నీరు రాగా, అధికారులు రెండు గేట్లను ఎత్తివేసి 4,644 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకు గాను 1.88 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు వద్ద నీటిపరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

జై జవాన్



కార్గిల్ గొప్ప విజయం

- కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి



విజయనగరం రూరల్: 1999 జూలై 26న శత్రుదేశం పాకిస్తాన్‌తో నియంత్రణ రేఖ వద్ద జరిగిన యుద్ధంలో భారత సైన్యం విజయం సాధించడం దేశానికి గర్వకారణం. 60 రోజుల పాటు జరిగిన యుద్ధంలో భారత సైన్యం పాక్ కుతంత్రాలను తిప్పికొట్టడమే కాకుండా భారత భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని విజయనాదం చేసింది. ఈ విజయానికి గుర్తుగా కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించడం గర్వకారణంగా భావిస్తున్నాం. ఈ యుద్ధంలో అమరులైన ప్రతీ సైనికుడు భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు ఎందరో భారత రక్షణ రంగంలో చేరి దేశ రక్షణకు కృషి చేయడం గర్వకారణం.



అదును చూసి కాల్పులు...



మాది బొబ్బిలి పట్టణం. నేను కార్గిల్ యుద్ధ సమయంలో మెకనైజ్డ్‌గా పనిచేసేవాడిని. యుద్ధ సమయంలో కానీ, బాహ్య ప్రపంచంలోకి వచ్చినపుడు కానీ కొన్ని రహస్యాలను పాటించాల్సి ఉంటుంది. ఆ యుద్ధంలో పాకిస్తాన్ వాళ్లను మన భూభాగం నుంచి తిప్పి కొట్టాలని అదును చూసి కాల్పులు జరిపేవాళ్లం. గరాస్ కేంద్రంగా మా బెటాలియన్ అప్పుడు పనిచేసింది. నాటి విజయం దేశానికి గర్వకారణం.

– ఎస్ఎస్ నాయుడు, నాయక్, సెక్షన్ కమాండర్

టైగర్ హిల్‌ను చుట్టుముట్టాం...



నేను సుబేదార్‌గా ఆర్మీలో విధులు నిర్వహించాను. కార్గిల్ హిల్ స్టేషన్‌లో ఉన్న టైగర్ హిల్ నుంచి పాకిస్తాన్ మూకలు ఎత్తు నుంచి మాపై దాడి కోసం చూస్తుండేవి. మాకు కింద నుంచి కొండమీద ఉన్న ప్రత్యర్థులను ఎదుర్కోవడం కష్టంగా అనిపించేది. దీంతో ఒక వ్యూహం ప్రకారం వారికి నీరు, ఆహారం, ఆయుధాలు దిగువ నుంచి వెళ్లకుండా మార్గాన్ని మూసేశాం. దీంతో వారు దిగొచ్చేసరికి మన సైన్యం విరుచుకుపడేది. కార్గిల్ ఆపరేషన్ నాటి దృశ్యాలు ఇప్పటికీ కళ్లముందు కదులుతాయి.

– రెడ్డి అప్పలనాయుడు, సుబేదార్, సీతానగరం

ముగ్గురు మిలిటెంట్లను హతమార్చా ..



రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా శౌర్యచక్ర అందుకుంటున్న ఆబోతుల వెంకటరావు

'ఆ రోజు నా జీవితంలో మర్చిపోలేని రోజు.. జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాను. అర్ధరాత్రి దాటిన తర్వాత 3 గంటల ప్రాంతంలో మిలిటెంటులే మా రెజిమెంట్‌లోకి ప్రవేశించారు. అక్కడ 150 సైనికులు నిద్రపోతున్నారు. నేను సెంట్రీ డ్యూటీ చేస్తున్నా. కాల్పుల శబ్దం రావడంతో అలర్ట్ అయ్యాను. ఏకే 47 రైఫిల్ వినియోగంలో శిక్షణ పొందడంతో ముగ్గురు మిలిటెంట్లను హతమార్చాను. అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా సౌర్యచక్ర అవార్డు తీసుకోవడం మర్చిపోలేనిదని విజయనగరం పట్టణంలోని జమ్మునారాయణపురంలో నివసిస్తూ ఆర్మీలో విధులు నిర్వహిస్తునఆబోతుల వెంకటరావు తెలిపారు.

ఉద్వేగభరిత క్షణాలు అవి



అప్పుడే ఆర్మీలో కొలువు దొరికింది. అదే సమయంలో కార్గిల్ యుద్ధం సంభవించింది. పాకిస్తాన్‌తో యుద్ధంలో పాల్గొనాలనే తపించాను. కానీ అవకాశం దొరకలేదు. నాటి మన ఆర్మీ విజయం సాధించిన క్షణాలు ఉద్వేగభరితమైనవి.

– ఎస్.మహేష్, మాజీ హవల్దార్, ఆర్మీ

కార్గిల్ యుద్ధంలో అక్కడే...



కార్గిల్ యుద్ధం జరుగుతున్న సమయంలో రిజర్వ్ బెటాలియన్‌లో విధులు నిర్వహించాను. ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనకపోయినప్పటికీ దగ్గరుండి తోటి సైనికులకు కావాల్సిన సేవలను అందించాను. నాటి భారత ఆర్మీ ధాటికి పాకిస్తాన్ తోకముడిచింది. ఈ అపూర్వ విజయ క్షణాలు తలుచుకుంటేనే ఎంతో గర్వంగా ఉంది.

– తూతిక గణేష్, మాజీ హవల్దార్, ఆర్మీ

- సాయుధ దళాల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా వాసులు
- దేశరక్షణ బాధ్యతలకు యువత సన్నద్ధం
- నేడు కార్గిల్ విజయ్ దివస్



సాక్షి ప్రతినిధి, విజయనగరం: దేశసేవకు యువత సై అంటోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాల యువత పెద్ద సంఖ్యలో సాయుధ దళాల్లో చేరుతోంది. ఇప్పటికే కొన్నేళ్ల పాటు సేవలు అందించినవారు దాదాపు వెయ్యిమంది వరకూ ఉన్నారు. విజయనగరం శివారు కోరుకొండలో ఉన్న సైనిక్ స్కూల్ యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. సైన్యంలో చేరడానికి ఆసక్తి చూపిస్తున్నవారికి ఎంపిక ప్రక్రియకు విజయనగరం పోలీస్ శిక్షణ కళాశాల మైదానం వేదిక అవుతోంది. 1999 సంవత్సరంలో లడఖ్ ప్రాంతంలోకి చొరబడిన ముష్కరులను, పాకిస్తాన్ సైన్యాన్ని తిప్పి కొట్టడంలో భారత సైన్యం అమోఘమైన పాత్ర పోషించింది. వారిలో మనవారూ ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారు. ఆ యుద్ధంలో అమరులైనవారిలో జిల్లాకు చెందిన సైనికులెవ్వరూ లేరు. ఆ విజయంలో పాత్ర పోషించిన సైనికుల పోరాట స్ఫూర్తిని, అమరుల ప్రాణత్యాగాన్ని స్మరించుకోవడానికి ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా భరతమాత సేవలో తరించిన, తరిస్తున్న సైనికుల కర్తవ్యదీక్షకు 'సాక్షి' అక్షర రూపం.

గర్వకారణం



జమ్మూకశ్మీర్‌లో విధి నిర్వహణలో సత్యనారాయణ (ఫైల్)



ఒక సైనికుడిగా కార్గిల్ యుద్ధంలో పనిచేసినందుకు ఎంతో గర్వకారణం. 1984లో ఆర్మీ విధుల్లో చేరాను. కార్గిల్ యుద్ధం సమయంలో 10 మద్రాస్ రెజిమెంట్‌లో ఇన్‌ఫెంటరీ ఫైటింగ్ గ్రూప్ (రిజర్వ్)లో విధులు నిర్వహించాను. కార్గిల్‌కు పైన ఎంతో ఎత్తులో ఉన్న ఛియాన్ పోస్ట్‌ను తొలుత పాకిస్తాన్ సైన్యం ఆక్రమించేందుకు బరితెగించింది. మైనస్ డిగ్రీలు చలి ఉండే ఛియాన్ ద్వారా కార్గిల్‌ను చేజిక్కించుకోవాలనేది వారి కుట్ర. దీన్ని మన భారత సైన్యం తిప్పికొట్టింది.

– గంద్రేటి సత్యనారాయణ, మాజీ సుబేదార్, ఆర్మీ , గరివిడి

ఇరవయ్యేళ్ల పాటు జమ్మూకశ్మీర్‌లో విధులు...



ఇరవయ్యేళ్ల పాటు జమ్మూ కశ్మీర్‌లో ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించాను. కార్గిల్ యుద్ధం జరిగినపుడు నేనూ అక్కడే విధుల్లో ఉన్నాను. ప్రాణాలకు తెగించి మన జవాన్లు యుద్ధంలో తలపడిన తీరు అద్భుతం. నాటి కార్గిల్ విజయ్ దివస్‌లో నేను ప్రత్యక్షంగా పాల్గొన్నందుకు ఎంతో గర్వంగా ఉంది.

– గంట శ్రీరామ్మూర్తి, మాజీ హవల్దార్, ఆర్మీ

విశ్రాంతి లేని సైనికుడు...



నెల్లిమర్ల మండలం సీతారామునిపేట గ్రామానికి చెందిన కల్యాణపు శంకరరావు జమ్మూకాశ్మీర్‌లో 17 ఏళ్ల పాటు ఆర్మీ జవాన్‌గా సేవలు అందించారు. 2019లో ఉద్యోగ విరమణ చేశారు. అక్కడితో ఆయన ఆగిపోలేదు. ఇంటికి వచ్చిన నాటి నుంచే గ్రామంలో యువతను సైన్యంలో చేరేలా సమాయత్తం చేస్తున్నారు. ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకూ 15 మంది ఆయన శిష్యులు సాయుధ బలగాల్లో చేరారు.

అదొక బాధ్యత



దేశరక్షణ ఒక మహత్తర బాధ్యత. దేశరక్షణ కోసం తీవ్రమైన చలిలోనూ విధులు నిర్వహిస్తాం. ప్రస్తుతం పంజాబ్‌లోని పఠాన్‌కోట్ వద్ద బాధ్యతలు నిర్వహిస్తున్నాను. కార్గిల్ యుద్ధం సమయంలో అమరులైన జవానుల త్యాగాలు మర్చిపోలేం. నాటి మన భారత సైనికుల కఠోర శ్రమ ఇప్పటికీ మేలుకొలుపుతోంది.

– సానుబిల్లి నాగబాబు, జవాన్, కొప్పర, వంగర మండలం

దేశసేవలో ఎంతో తృప్తి...



చిన్నప్పటి నుంచి ఏరోనాటిక్స్ అంటే ఇష్టం. అందువల్లనే ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం చేయాలని బలంగా కోరుకున్నాను.. చేశాను. అక్కడికి వెళ్లేవరకూ ఉద్యోగం అని వెళ్తారు. అక్కడికి వెళ్లాక ఇది ఉద్యోగం అన్న భావన పోయి ఇది నా దేశం, నా బాధ్యత అన్న ఫీల్ వస్తుంది. 2001లో ఎయిర్‌మన్‌గా చేరాను. 2021లో సార్జంట్‌గా రిటైర్ అయ్యాను. కార్గిల్ వార్‌లో పాల్గొన్న పైలెట్లు, సార్జంట్స్, కమాండర్స్‌తో కలిసి ఆగ్రాలో పనిచేశాను. నాటి కార్గిల్ వార్ విశేషాలు, అనుభవాలు వారు చెబుతుంటే దేశభక్తి ఉప్పొంగుతుంది. దేశసేవలో ఎంతో తృప్తి ఉంది.

– డబ్ల్యూ.రఘురామ్, రిటైర్డ్ సార్జెంట్, భారత వాయుసేన

దేశం కోసం రాత్రింబవళ్లు



కార్గిల్ యుద్ధ సమయంలో నేను మా బెటాలియన్‌లతో కసి జమ్మూకశ్మీర్ చౌకీబార్ సెక్టార్‌లో కమ్యూనికేషన్ విభాగంలో 50 రోజులు విధులు నిర్వహించా. నాటి యుద్ధ సమయంలో మన జవాన్ల ప్రాణత్యాగాలు, వీరోచిత పోరాటాలు, సిద్ధించిన విజయ క్షణాలు తలుచుకుంటే నేటికీ ఉద్వేగంతో పులకరించిపోతాను. నాడు ఎత్తైన కొండలపై నుంచి దాడి చేస్తున్న శత్రువులను మట్టుబెట్టే క్రమంలో భారత ఆర్మీ దృఢ సంకల్పంతో ముందుకు కదిలింది. బరువైన యుద్ధ సామగ్రిని మోస్తూ కాలినడకన కొండలపైకి చేరి పాక్ శత్రుమూకలను తుదముట్టించింది. నాటి యుద్ధ సమయంలో నేను విధుల్లో ఉండటం గర్వంగా ఉంది.

– ప్రసన్నకుమార్ బెహరా, విశ్రాంత, ఆర్మీ ఉద్యోగి, పాలకొండ

ప్రగతి పథంలో మన్యం

- సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ
- గిరిజనుసంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- గిరిశిఖర గ్రామాలకు రోడ్ల సదుపాయం
- సాలూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు భేష్
- నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి అమర్నాథ్
- అభివృద్ధి పనులపై సమీక్ష



సాలూరు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్నాథ్

పార్వతీపురంటౌన్: జిల్లాల పునర్విభజనలో కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా ప్రగతిపథంలో పయనిస్తోందని, అధికారులు, పాలకులు చిత్తశుద్ధి, సమన్వయంతో పనిచేయడంతో ప్రగతి సూచికలు నమోదవుతున్నట్టు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సాలూరు నియోజకవర్గ అభివృద్ధిపై మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకొని, వాటికి పరిష్కారమార్గాలు చూపేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గ స్థాయి సమీక్షలకు శ్రీకారం చుట్టారన్నారు. మన్యం జిల్లాకు జాతీయస్థాయిలో అవార్డులు లభించడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులకు సిబ్బందికి అభినందన తెలిపారు. సాలూరులో 1.5 ఎకరాల స్థలంలో ట్రక్‌బే ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికను అందజేయాలని అధికారులకు సూచించారు.

సాలూరు–మక్కువ రోడ్డుకు రూ.55 కోట్లు

సాలూరు–మక్కువ రోడ్డు నిర్మాణానికి రూ.55 కోట్లు మంజూరయ్యాయని, పనుల ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సూచించారు. సమస్యలు త్వరగా పరిష్కారించేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. అత్యంత ప్రాధాన్యత పనుల పూర్తికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాజన్నదొర కోరారు. పెద్దగెడ్డ రిజర్వాయర్ పునరావాస పనులు పూర్తిచేయాలని సూచించారు. సాలూరు నియోజకవర్గంలో తుదిదశలో ఉన్న 24 అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పూర్తిచేసి అప్పగించాలన్నారు. సురాపాడుపై ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. పాఠశాలలకు ప్రహరీ, గేట్లు, సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులు ఉండాలని, ఈ మేరకు జీఓ 40 జారీ చేశామన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా గిరిజన ప్రాంతంలో చేపట్టిన టిడ్కోగృహనిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలన్నారు.

రోడ్ల పనులు ప్రారంభం

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న రోడ్ల పనులు అన్ని జిల్లాల్లో ప్రారంభమయ్యాయన్నారు. అంగన్‌వాడీ భవనాల మరమ్మతుల నివేదిక సమర్పిస్తే జెడ్పీ నుంచి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం

కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ శాఖల వారీగా వచ్చే ప్రతిపాదనలు, వాటిపై చర్యలు స్పష్టంగా ఉండాలని, అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించారు. దలైవలస వద్ద పెద్దగెడ్డపై డైవర్షన్‌లో ముంపునకు గురవుతున్న భూముల స్థానంలో ప్రత్యామ్నాయంగా రైతులకు ఇవ్వాల్సిన భూములను గుర్తించాలని ఆర్డీఓకు సూచించారు. మౌలిక సదుపాయాలు అవసరమైన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల వివరాలు సమర్పించాలన్నారు.

- సాలూరు నియోజకవర్గంలో మూడు మండలాల్లో 33 గ్రామాల నుంచి 341 మంది లబ్ధిదారులకు 368 ఎకరాలు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేసినట్టు కలెక్టర్ వెల్లడించారు. కొత్తగా మరో 69 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీచేసే అంశాన్ని సబ్ డివిజన్ సమావేశంలో పరిశీలించి మంజూరు చేస్తామని చెప్పారు.
- చిలకమెండంగి, బంద మెండంగి, తాడిపుట్టి, దోయవర్ మీదుగా మక్కువ మండలం బాగుజోల నుంచి సాలూరు మండలం సిరివర వరకు రూ.13కోట్లతో రహదారి, సాలూరు నుంచి చినపారన్నవలస రహదారిలో వేగావతిపై అసంపూర్ణంగా ఉన్న శివరాంపురం బ్రిడ్జిని రూ.5.95కోట్లతో నిర్మించేందుకు అంచనాలు రూపొందించామన్నారు. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 7 రహదారులను రూ.15.40 కోట్లతో నిర్మించినట్టు వెల్లడించారు.
- పెద్దగెడ్డ రిజర్వాయర్ పునరావాస పనులు రూ.7.92 కోట్లకు ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని, చెరుకుపల్లి గెడ్డ పనులు రూ.4.67 కోట్లతో ప్రతిపాదించగా ఆర్థికశాఖ పరిశీలనలో ఉందని, వీఆర్ఎస్‌పై అక్విడెక్టు పనులు రూ.5.70 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చామని జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారి ఆర్.అప్పారావు వివరించారు. అడారుగెడ్డపై దుగ్గేరు వద్ద ఆనకట్టు కట్టేందుకు రూ.4.50 కోట్లతోను, దలైవలస వద్ద పెద్దగెడ్డపై డైవర్షన్ స్ట్రక్చర్ నిర్మాణానికి రూ.3 కోట్లతో ప్రతిపాదించామన్నారు.
- పెదభద్ర వద్ద ఉన్న నీటి పథకం నుంచి 10 గ్రామాలకు నీటిని సరఫరాకు రూ.12.08 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు తెలిపారు.
- 22 బ్లాకుల్లో 1248 టిడ్కో గృహాలు నిర్మాణం జరుగుతున్నాయని, ఆగస్టు నాటికి పూర్తి అవుతాయని డీఈ తెలిపారు. మౌలిక సదుపాయాలు కల్పనకు రూ.7.76 కోట్లు మంజూరైనట్టు వెల్లడించారు.
- సాలూరు మున్సిపాలిటీలో రూ.4 కోట్లతో పార్కు నిర్మాణానికి ప్రతిపాదించామని మున్సిపల్ కమిషనర్ శంకరరావు తెలిపారు. సాలూరు అత్యధిక లారీలు ఉన్న ప్రాంతమని, ఆటోనగర్ అవసరమని, రూ.10 కోట్లతో ఏర్పాటుకు ప్రతిపాదించామని చెప్పారు.
- పార్వతీపురం మన్యం జిల్లాలో గృహ అవసరాలు ఎక్కువగా ఉన్నందున, ఇప్పటికే సొంత స్థలాలుగా గుర్తించిన లబ్ధిదారులతో పాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అందిన అర్జీలను కూడా మంజూరు చేయాలని సమావేశంలో తీర్మానించారు. గిరిశిఖర ప్రాంతాలు వంటి విభిన్న భౌగోళిక ప్రాంతాలు ఉన్న దృష్ట్యా యూనిట్ ఖరీదు అదనంగా కొంత మొత్తం మంజూరుకు తీర్మానించామన్నారు. సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్ఓ జె.వెంకటరావు, ఆర్డీఓ కె.హేమలత, జిల్లా స్థాయి అధికారులు, సాలూరు నియోజకవర్గ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు




పార్వతీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పార్వతీపురం మన్యం జిల్లాలో మంగళవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. చెరువులు, పొలాల్లో నీరు చేరడంతో వరి ఉభాలు ఊపందుకున్నాయి. జిల్లాలో 472.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పార్వతీపురం మన్యం జిల్లాలో వర్షపాతం

మండలం	వర్షంపాతం మిల్లీమీటర్లు
వీరఘట్టం	35.8
సీతంపేట	62.8
భామిని	38.4
పాలకొండ	42.6
కొమరాడ	10.4
గుమ్మలక్ష్మీపురం	15.8
కురుపాం	21.4
జియ్యమ్మలస	34.6
గరుగుబిల్లి	100.6
పార్వతీపురం	25.8
మక్కువ	5.6
సీతానగరం	14.4
బలిజిపేట	19.2
సాలూరు	40.8
పాచిపెంట	4.6

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. అమ్మవారికి తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

1450 సారా ప్యాకెట్లు స్వాధీనం



సారా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుపడిన వాహనాలతో నిందితులు

పాచిపెంట: అక్రమంగా సారా తరలిస్తున్న నలుగురు వ్యక్తుల నుంచి 1,450 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గంలోని పురిటిపెంటకు చెందిన తాడిపైడిరాజు, నగర కృష్ణ లు ఒడిశాలోని పొట్టంగి నుంచి షిఫ్ట్ డిజైర్ కారులో 1000 సారా ప్యాకెట్లు పి.కోనవలస చెక్ పోస్టు మీదుగా గజపతినగరం తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నామన్నారు. అలాగే ఒడిశాలోని లావుడి గ్రామానికి చెందిన చిన్ని, మగంటూలు ద్విచక్ర వాహనంపై 450 సారా ప్యాకెట్లు సాలూరు తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. నలుగురు నిందితులను, వారి వద్ద ఉన్న 1450 సారా ప్యాకెట్లు, షిఫ్ట్ డిజైర్ కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటలో ఘర్షణ



గాయాలపాలైన పేకాటరాయుళ్లు

పార్వతీపురం: పేకాట ఆడుతున్నప్పుడు రేగిన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. మంగళవారం జరిగిన సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం సన్యాసిరాజుపేటకు చెందిన పి.లక్ష్మణ ఇంట్లో వై.విజయ్, ఎస్.హరి, వై.కిరణ్, ఎ.లక్ష్మణ తదితరులు సోమవారం రాత్రి పేకాట ఆడారు. పేకాట ఆడుతున్న వారి పక్కన పెంకి ప్రసాద్ కూర్చున్నాడు. కౌంట్ విషయంలో పేకాటరాయుళ్ల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఎవరింటికి వారు వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం ప్రసాద్ చెరువునుంచి ఇంటికి వస్తున్నప్పుడు రాత్రి కాదురా ఇప్పుడు రారా చూసుకుందాం అంటూ వై.విజయ్, ప్రసాద్‌ల మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. దీంతో విజయ్, ప్రసాద్, దావీద్‌లు ఒకరికొకరు కొట్టుకున్నారు. ఈ కొట్లాటలో ముగ్గురికీ గాయాలు కావడంతో చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,160-00
బంగారం(22కి. 10గ్రా.)	55,150-00
వెండి (కిలో)	80,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

శిశువుల్లో లోపాలను గుర్తించాలి

- వర్క్‌షాప్‌లో యునిసెఫ్ బృందం



మాట్లాడుతున్న డాక్టర్ రాజన్ శుక్లా

విజయనగరం అర్బన్: బిడ్డలు జన్మించిన నాటి నుంచి మూడేళ్ల లోపలే మెదడు ఎదుగుదల జరుగుతుందని, ఈ వయసులోనే బిడ్డల్లోని లోపాలను కుటుంబసభ్యులే ముందు గుర్తించాలని యునిసెఫ్ ప్రతినిధులు సూచించారు. తొందరగా గుర్తించడం వల్ల వారిలోని లోపాలను సరిదిద్దుకునే అవకాశం కలుగుతుందన్నారు. మూడేళ్ల లోపల వారి వయస్సుకు తగ్గట్టు శిశువులలో అభివృద్ధి జరుగుతుందని ఏ వయసులో ఏమేం మార్పులు జరుగుతాయో తల్లిదండ్రులు, లేదా కుటుంబసభ్యులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పిల్లల పెంపకం కోసం కుటుంబం, సంఘానికి సాధికారత చేకూర్చడం అనే అంశంపై యునిసెఫ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ విభాగం నుంచి వచ్చేసిన వైద్యుల బృందం కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఐసీడీఎస్‌ల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన అధికారులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. బృందం నాయకుడు డాక్టర్ రాజన్ శుక్లా మాట్లాడుతూ శిశువు తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే అన్నీ నేర్చుకుంటుందని, అందువల్ల గర్భిణిగా ఉన్నప్పుడు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని, మంచి మాటలు మాట్లాడడం, సంతోషంగా ఉండడం, సంగీతాన్ని వినడం, మంచి ఆహారాన్ని తీసుకోవడం వంటి పనులు చేయాలని చెప్పారు. బిడ్డ జన్మించిన తొలిరోజు నుంచే అభివృద్ధి మొదలవుతూ దినదినం పెరుగుతుందని ఇందులోని మార్పులను తల్లిదండ్రులు, బిడ్డను సాకే ఇతర కుటుంబసభ్యులు గుర్తించాలని సూచించారు. వర్క్‌షాప్‌లో శిశువుల ప్రారంభ బాల్యం అభివృద్ధి అనే అంశంపై యునిసెఫ్ ప్రతినిధులు డాక్టర్ సలీనా, డాక్టర్ యశస్విని, డాక్టర్ కిరణ్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ మరీనా, డాక్టర్ నిరుపమ శిక్షణకు సంబంధించిన పలు అంశాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

సఖి కార్యక్రమానికి ప్రసంశలు

జిల్లాలో అమలు చేస్తున్న సఖి కార్యక్రమానికి యునిసెఫ్ బృందం ప్రశంసలు కురిపించింది. 150 దేశాలు పాల్గొన్న జీ-20 సదస్సులో విజయనగరం నుంచి సఖి కార్యక్రమానికి చోటు దొరకడం అరుదైన సంఘటన అని పేర్కొన్నారు. అంతటి ఘనత సాధించిన జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులకు అభినందనలు తెలిపారు. సఖి ద్వారా చేపడుతున్న కార్యక్రమాలకు ప్రపంచ గుర్తింపు రావడం గొప్ప విషయమని వాటి ఫలితాలను త్వరలో అందుకుంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కరరావు, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, డివిజనల్ పంచాయతీ అధికారి మోహన్‌రావు, మన్యం జిల్లా డీఐఓ జగన్‌మోహన్ రావు తదితరులు పాల్గొని వారి సలహాలను అందించారు.

లాభం చేకూరే పంట సాగుచేయాలి

- జిల్లా పట్టుపరిశ్రమ శాఖాధికారి సాల్మన్‌రాజు



పాతరేగలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పట్టు పరిశ్రమ శాఖాధికారి సాల్మన్‌రాజ్

రామభద్రపురం: రైతులు నిత్యం పండించే పంటలు కాకుండా పెట్టుబడి తక్కువ, అధిక దిగుబడితో పాటు లాభాలు చేకూరే పంటలు సాగు చేయాలని జిల్లా పట్టుపరిశ్రమ శాఖాధికారి సాల్మన్‌రాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రామభద్రపురం మండలం పాతరేగలో పట్టు పురుగుల పెంపకంపై రైతులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టుపురుగుల పెంపకానికి ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీ, ఓసీ రైతులకు 75 శాతం సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. పట్టు పురుగుల పెంపకం ద్వారా రైతులు ఏడాదికి ఆరు నుంచి ఏడు పంటలు తీయవచ్చని, ఎకరాకి 25 రోజులకు గాను రూ.25 వేల వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. సెరికల్చర్ పంటలకు వర్షాకాలం అనుకూలమన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి టి నాగేశ్వరరావు, టెక్నికల్ అధికారులు ఎస్.అప్పలనాయుడు, అవతారం తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ల దొంగ అరెస్టు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామం సమీపంలో గల లోటస్ సిమెంట్ బ్రిక్స్ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించిన సెల్‌ఫోన్లు చోరీ చేసిన విశాఖపట్నం జిల్లా తాటిచెట్ల పాలెం ప్రాంతానికి చెందిన పిడుగు మణికంఠను ఎస్సై వీరజనార్దన్ మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరపర్చారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సిమెంట్ బ్రిక్స్ పని చేస్తున్న కార్మికులు మంగళవారం ఉదయం రూ.20 వేల విలువైన రెండు సెల్‌ఫోన్‌లను ఆఫీస్ రూమ్‌లో చార్జింగ్ పెట్టి గదికి తాళం వేసి టిఫిన్ చేసేందుకు కొత్తవలస జంక్షన్‌కు వెళ్లారు.తిరిగి వచ్చి చూసేసరికి ఆఫీస్ తాళం విరగొట్టి ఉంది. లోపల చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్‌లు కనిపించలేదు. దీంతో కార్మికుడు కె.సన్యాసినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరజనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మణికంఠను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో నేరం ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరచగా రిమాండ్ విధించారు.

విద్యుత్ వైర్ల చోరీ

గుర్ల: మండలంలోని బెల్లాన పేట వద్ద జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించడానికి అధికారులు ఉంచిన విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. చోరీకి గురైన వైర్ల విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు గుర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు చెప్పారు.

రాష్ట్ర పోటీలకు ఇద్దరు క్రీడాకారిణులు

శృంగవరపుకోట: పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్‌లో సాధన చేస్తున్న ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన ఇద్దరు క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ డాక్టర్ పి.శ్రీరాములు చెప్పారు. ఈ మేరకు ఎంపికైన భరిణికాన హారిక, పంపాన మౌనికలు ఈ నెల 29వ తేదీ నుంచి 31 వరకూ చిత్తూరు జిల్లా తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల డబుల్స్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన వారిని స్థానికులు, క్రీడాకారులు అభినందించారు.

ప్రథమస్థానంలో గంట్యాడ మండల సమాఖ్య

- గ్రేడింగ్ ఇస్తున్న ప్రభుత్వం



మండల సమాఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్న సభ్యులు

గంట్యాడ: జిల్లాలో ఉన్న మండల సమాఖ్యల కంటే గంట్యాడ మండల సమాఖ్య ఆదర్శంగా నిలుస్తోంది. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గంట్యాడ మండల సమాఖ్య గత ఏడాది జాతీయ స్థాయి అవార్డు అందుకుంది. తాజాగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ప్రభుత్వం ఇచ్చే గ్రేడింగ్‌ల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. మండల సమాఖ్య పరిధిలో ఉన్న అన్ని స్వయం సహాయక సంఘాల్లో 90 శాతానికి పైగా సంఘాలు ఏగ్రేడ్‌లో ఉండడం విశేషం.

11 అంశాల అధారంగా సంఘాలకు గ్రేడింగ్

స్వయం సహాయక సంఘాలకు 11 అంశాల్లో ప్రతిభ అధారంగా గ్రేడింగ్ కేటాయిస్తారు. క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం, క్రమం తప్పకుండా సభ్యులందరూ హాజరుకావడం, ప్రతినెలా పొదుపు కట్టడం, ఆన్‌లైన్ మొబైల్ బుకింగ్ రెగ్యులర్‌గా చేయడం, సంఘం నుంచి అంతర్గత అప్పుల చెల్లింపు, సామాజిక పెట్టుబడి, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, సామాజిక పెట్టుబడి నిధి రుణాలు క్రమం తప్పకుండా చెల్లించడం వంటి అంశాల ఆధారంగా గ్రేడింగ్ ఇస్తారు.

ఎన్‌సీసీతో యువత భవిష్యత్తులో మార్పు

- వీడ్కోలు సభలో కమాండింగ్ ఆఫీసర్



సత్కారం పొందుతున్న కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ నోటీయల్

విజయనగరం అర్బన్: ఎన్‌సీసీలో చేరి శిక్షణ పొందడం వల్ల యువత భవిష్యత్తులో మంచి మార్గంలో పయనిస్తారని ఎన్‌సీసీ 2 ఏ బెటాలియన్ విజయనగరం కమాండింగ్ ఆఫీసర్ ఏకే నోటీయల్ అన్నారు. ఆయన బదిలీని పురస్కరించుకుని బెటాలియన్ స్టాఫ్, ఎన్‌సీసీ ఆఫీసర్సు, సత్య కళాశాల యాజమాన్యం సంయుక్తంగా స్థానిక సత్య కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన వీడ్కోలు సభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలు విజయనగరంలో పనిచేసిన జ్ఞాపకాలు మర్చిపోలేనివన్నారు. ఎన్‌సీసీలో పనిచేయడం వల్ల తాను చాలా విషయాలు తెలుసుకున్నానని, యువతను చాలా దగ్గరగా పరిశీలించడం, వారిని ఉత్తేజపరచడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన సత్య విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ మూడు సంవత్సరాల పాటు కమాండింగ్ ఆఫీసర్ నోటీయల్ చేసిన మరువలేనివన్నారు. అనంతరం నోటీయల్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆఫీసర్ మేజర్ శివాని శ్రీవాస్తవ, సుబేదార్ మేజర్ రామ్‌దత్, సూపరింటెండెంట్ సురేష్, ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్‌లు ఎం.వరలక్ష్మి, అమృత, ఎన్‌సీసీ గరల్స్ బెటాలియన్ సివిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో తరించాలి



వృద్ధులకు అన్నదానం

విజయనగరం టౌన్: యువత సమాజ సేవలో తరించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి యర్ర చంద్రమ్మ అన్నారు. పూల్‌బాగ్‌లో ఉన్న ప్రేమ సమాజంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా చూసుకోవాలన్నారు. మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ఆలోచించి సహాయమందించాలన్నారు. కార్యక్రమంలో కోడెల పద్మ, ఈగల రాధామణి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన జ్వాల




ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసనలో పాల్గొన్న సీపీఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యంత క్రూరంగా అత్యాచారానికి పాల్పడిన మతోన్మాద మృగాలను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. సీపీఐ దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మణిపూర్ ఘటనను నిరసిస్తూ రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రంగరాజు, బి.పావని, బి.రమణమ్మ, ఎస్.నాగభూషణం, పి.అప్పలరాజు, పి.రాంబాబు, ఎ.జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరి నాట్లు

- 47వేల మెట్రిక్ టన్నుల ఎరువుల సిద్ధం



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు

లక్కవరపుకోట : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లాలో ఆశాజనకంగా వరి నాట్లు పడుతున్నట్లు వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వి.టి.రామారావు తెలిపారు. ఎల్.కోట మండలంలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడారు. జిల్లాలో వర్షపాతం గత ఏడాదితో ఈ సమయంతో పోల్చితే 5శాతం ఎక్కువగా ఉందన్నారు. ప్రస్తుత ఏడాది జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 93,643 హెక్టార్లు ఉన్నట్లు తెలిపారు.ఇందుకు గాను రైతులకు రాయితీపై 40 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను అందించినట్లు చెప్పారు. అలాగే రైతులకు అందించేందుకు 47 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేశామని తెలిపారు.

రాగి పంట సాగు పెంచేందుకు కృషి

జిల్లాలో ప్రస్తుత ఏడాది నుంచి రాగుల సాగు విస్తీర్ణం పెంచేందకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 32 హెక్టార్లలో సాగు ఉందని దీనిని 70 హెక్టార్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు, ఇందుకు తగిన విధంగా రైతులకు ప్రోత్సాహం అందజేస్తున్నట్లు చెప్పారు.

గూడ్స్ ఢీ కొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన తాతారావు

చీపురుపల్లి: పట్టణంలోని రామాంజనేయకాలనీకి చెందిన జాజుల తాతారావు(50) గూడ్స్ రైలు ఢీకొని మృతిచెందాడు. దీనికి సంబంధించి జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో నడుచుకుంటూ వస్తున్న తాతారావును ప్రమాదవశాత్తు గూడ్స్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మద్దువలసలో ఏనుగుల గుంపు

- పరిశీలించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



పంటపొలాల్లో ఏనుగుల గుంపు



ఏనుగులు సంచరిస్తున్న ప్రదేశానికి వెళ్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: మండల పరిధి మద్దువలస పంటపొలాల్లో ఏనుగుల గుంపు తిష్టవేసింది. రెండు రోజులుగా మద్దువలస ప్రాజెక్టు కింది భాగంలో ఎనిమిది ఏనుగుల గుంపు చెరకు, మొక్కజొన్న, వరి నారుమడులను ధ్వంసం చేసింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలిఫెంట్ ట్రాకర్స్ వాటి వెంట ఉంటూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

ఏనుగులు సంచరిస్తున్న ప్రదేశాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు కోరారు. మద్దువలస పంటపొలాల్లో ఏనుగులు గుంపును వారు మంగళవారం పరిశీలించారు. ఏనుగుల నుంచి ఎటువంటి ప్రమాదం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని అటవీశాఖ అధికారులను కోరారు. పంటలకు నష్టం వాటిల్లితే గుర్తించాలని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావిల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి, బూరాడ వెంకటరావు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రోత్‌సెంటర్‌లో సీసీ రోడ్లు

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



గ్రోత్‌సెంటర్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

బొబ్బిలి: నెల్లూరు ఇండస్ట్రియల్ పార్కులో బీటీ రోడ్ల స్థానంలో సీసీ రోడ్లను నిర్మించామని, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో కూడా అదే తరహాలో సీసీ రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన గ్రోత్‌సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పరిపాలనా భవనంలో ఉన్న ఆర్డీఓ కార్యాలయంలో ఏపీఐఐసీ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కాసేపు సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రోత్‌సెంటర్‌లో పరిశ్రమలున్న ప్రాంతాలు, ఖాళీ స్థలాలు, ఇతర ప్రాంతాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 65 శాతం పరిశ్రమలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మిగతా 35 శాతం పరిశ్రమలను ప్రారంభించేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి ఆన్‌లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

సాలూరులో ఆటోనగర్

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో ఎకరన్నర స్థలంలో రూ.4.3 కోట్లతో ఆటోనగర్‌ను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఖాయిలా పడిన పరిశ్రమలు సైతం పునరిద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మూడో రైల్వే లైన్ వస్తున్న కారణంగా సంబంధిత రవాణా ఏర్పాట్లు సిద్ధం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. విజయనగరం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, సాలూరు మున్సిపల్ కమిషనర్ హనుమంతు శంకరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, గోపాలరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ యతిరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విషపూరిత పుట్టగొడుగులు తిని అస్వస్థత



రేగిడి : బాధితులను 108 వాహనంలో పాలకొండకు తరలిస్తున్న దృశ్యం

రేగిడి: నాటు పుట్టగొడుగులు అని భావించి పొరపాటున కుక్కపుట్టగొడుగులు తిన్న ఓ కుటుంబం అస్వస్థతకు గురైంది. రేగిడి మండలంలో మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. దేవుదల గ్రామానికి చెందిన ఇనుముల హరిబాబు, సుజాత, సరోజిని తదితరులు సోమవారం పొలంపనులకు వెళ్లిన సమయంలో గట్టుపై పుట్టగొడుగులు కనిపించాయి. వాటిని ఇంటికి తీసుకొచ్చి సోమవారం రాత్రి వండుకుని తిన్నారు. అర్ధరాత్రి నుంచి వాంతులతో పాటు రక్త విరేచనాలు అయి పరిస్థితి విషమించడంతో మిగిలిన కుటుంబసభ్యులు 108 వాహనానికి సమాచారం అందించగా హుటాహుటినా సంఘటనాస్థలానికి సిబ్బంది చేరుకున్నారు. ఈఎంటీ మీసాల ఈశ్వరరావు వాహనంలోని అత్యాధునిక వస్తుసామగ్రితో ప్రాథమిక వైద్యం చేశారు. బాధితులను ప్రాణాపాయం నుంచి రక్షించి పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితులు ఆరోగ్యంగా ఉన్నారని, ఆస్పత్రిలో కోలుకుంటున్నారని స్థానికులు తెలిపారు.

మెడికల్ షాపులో చోరీ

విజయనగరం క్రైమ్: కలెక్టరేట్ సమీపంలో ఉన్న వీరసాయి మెడికల్ షాపులో దొంగలు చొరబడి షట్టర్ విరిచి కౌంటర్‌లో రూ. 8వేలు అపహరించుకుపోయారని షాపు యజమాని జామి గణేష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై అశోక్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళకు తీవ్రగాయాలు

ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా స్కూటీపై వెళ్తున్న మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక దాసన్నపేట నుంచి డెంకాడ వెళ్లే రహదారి లో నీలాపు చెరువు సమీపంలో సారిపల్లి అప్పలకొండ స్వగ్రామమైన సారిపల్లికి స్కూటీపై వెళ్లోంది. డెంకాడ నుంచి వచ్చిన ఆటో డ్రైవర్ ఆమె పక్క నుంచి హిట్ ఇచ్చాడు. దీంతో ఆమె పక్కకు పడిపోవడంతో రోడ్డుకు తగిలి కాలు విరిగింది. స్థానికులు గమనించి ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై ప్రసన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
- Golden Opportunity to avail upto 0 to 100% Scholarships on fees for CBSE School, Jr. College (MPC, BiPc, CEC, MEC), Degree (B.Sc. MPC, B.Sc. MPCs, B.Com, B.Com Computers). Contact:- 9177558861. Omsai Com Institute, Anantavaram Rd, Maddi, Padmanabhan, VSP 531219 [WB-16093]

ONE SITTING
- ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discont.) Exam in August. ✆ : 73383 76874 [R-60]

WANTED
- ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 72074 45296 [V-6195]
- ప్రముఖుల ఇళ్ల వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం: 14-20K, వసతి + భోజనం, VJA. ✆ 91608 35559, 78158 35561 [B-249]
- ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 9676414393. [M-1221469]

- IRPM కంపెనీ SKLM, VZM మండలాల్లో నూతనంగా ప్రారంభించిన బ్రాంచ్‌లో BMMT లో చేయుటకు 10th, ఇంటర్, 50 మంది యువతీ యువకులు కావలెను. Income: 12000 - 20000/-. Cell: 9849553548. [WA-7205]
- JOB VACANCY: Age: 18 to 30 yrs, Qul: 10th to Any Degree, Office Job: 18000/- to 25000/-, Work from Home 15000/- to 18000/- . ✆ 8015072742. [T-1771]
- కష్టలెస్స్ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP& డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/-, ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 7993583999 [HA-440]
- ప్రముఖ బ్యాంకులలో కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీసు అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్లు: 10th - డిగ్రీ, జీ: 25,000/-. 9642252949 [G-7455]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.